క్లుప్తంగా

తెలుగుగంగకు మాత్రమే నీటి విడుదల



తెలుగుగంగకు విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి తెలుగుగంగకు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ దేవేంద్ర తెలిపారు. ఆదివారం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 2,000 క్యూసెక్కుల నీరు ఎస్ఆర్ఎంసీ ద్వారా బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు వచ్చి చేరుతుందన్నారు. కాగా 2,000 క్యూసెక్కుల నీటిని తెలుగుగంగ(వీబీఆర్)కు విడుదల చేస్తున్నామని, జీఎన్ఎస్ఎస్, కేసీసీ ఎస్కేప్ ఛానల్ గేట్లు బంద్ చేసినట్లు ఆయన వివరించారు.

34 కేసులకు పరిష్కారం

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాల నుంచి స్టేషన్లో నమోదయిన 34 కేసులకు లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం చూపినట్లు ఎస్ఐ హుస్సేన్‌బాషా ఆదివారం తెలిపారు. గ్రామాలలో ప్రజలు ద్వేషాలు మాని, అన్నదమ్ములవలే కలిసి ఉండాలని సూచించారు. మండలంలో మొట్టమొదటిసారిగా లోక్ అదాలత్ ద్వారా 34 కేసులు పరిష్కారం చేశామని చెప్పారు. అదేవిధంగా టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టు, 14 రిమాండ్ విధించిన సందర్భంగా ఎవ్వరు కూడా మండలంలో ర్యాలీలు, నిరసనలు, సభలు నిర్వహించకూడదని హెచ్చరించారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడాకారుల ఎంపిక

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి స్కూల్ గేమ్ పోటీలకు వివిధ పాఠశాల చెందిన క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శంకర్ ఆదివారం తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అండర్ -14-, అండర్ -17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్, బ్యాడ్మింటన్, టెన్నీస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరు కావచ్చన్నారు. పీడీ దేవానంద్ పాల్గొన్నారు.

ఆవులు, ఎద్దులకు టీకాలు

జూపాడుబంగ్లా: తెల్లజాతి పశువులైన ఎద్దులు, ఆవులకు చర్మవ్యాధులు, లంపీస్కిన్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ముందస్తుగా రైతు భరోసా కేంద్రాల్లో టీకాలు వేస్తున్నట్లు వెటర్నరీ ఏడీ రామాంజనేయనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆవులు, ఎద్దులు, లేగదూడలకు ప్రస్తుతం చర్మవ్యాధులు, లంపీస్కిన్, బొబ్బలేక దద్దుర్లు రావటం తదితర అంటు వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయన్నారు. వాటి పోషకులు తప్పనిసరిగా ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో పశువైద్య సహాయకులను ఆశ్రయించి ఉచితంగా టీకాలు వేయించుకోవాలని సూచించారు.

ఓంకారంలో భక్తుల సందడి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న ఓంకారం క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. శ్రావణమాసం, వివాహాలు ఉండటంతో వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి తరలివచ్చారు. శ్రీ గంగా, ఉమాసమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు.

పురుగు మందు ప్రభావంతో అస్వస్థత

రుద్రవరం: మండలంలోని ఎల్లావత్తులకు చెందిన జగన్ అనే యువకుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. జగన్ ఆదివారం తన సొంత పొలంలో వరి పంటలో తెగుళ్ల నివారణకు విష గుళికలు చల్లుతుండగా విష ప్రభానికి అక్కడే కుప్పకూలాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానిక వైద్యశాలలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు

నంద్యాల(న్యూటౌన్): ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని సైక్రియాటిస్ట్ డాక్టర్ శరత్‌చంద్ర అన్నారు. ఆదివారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని న్యూక్లియస్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ జీవన గమనంలో సమస్యలను అధిగమిస్తూ పూర్తి ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. అన్నెం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పిల్లలతో సానుకూల దృక్పదాన్ని పెంపొందించాలని, తద్వారా ఆత్మహత్యలకు నివారించవచ్చన్నారు. శేషఫణి, నీలం వెంకటేశ్వర్లు, ప్రసాద్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పల్లె ముంగిట్లో పాలన

- సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం
- ఉన్న చోటనే అన్ని రకాల సేవలు
- కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్, దర్శనాల ఆన్‌లైన్ బుకింగ్ సేవలు
- గ్రామీణులకు తప్పిన వ్యయ ప్రయాసలు

నందికొట్కూరు: గత ప్రభుత్వ పాలన వరకు గ్రామాల్లో కనీసం పంచాయతీ భవనాలకే దిక్కు లేదు. రెవెన్యూ, మండల పరిషత్ పరంగా ఏ చిన్న అవసరం వచ్చినా...మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉండేది. రోజులు తరబడి తిరిగితే కానీ ఆ పనులు పూర్తయ్యేవి కావు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయాల ద్వారా ప్రభుత్వ పాలన పల్లె ముంగింటకు తెచ్చింది. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు కావాల్సిన సేవలు ఇంటి వద్దకే అందజేస్తుంది. దీంతో ప్రజలకు వ్యయప్రయాసలు తప్పాయి.

రూ. 40 లక్షల వ్యయంతో ఆధునిక భవనాలు

గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు పొందాలంటే టీడీపీ జన్మభూమి కమిటీల సిఫార్సుల మేరకే మంజురయ్యే దుస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి పంచాయతీలో రూ. 40 లక్షల వ్యయంతో ఆధునిక వసతులతో సచివాలయ భవనాలు శరవేగంగా నిర్మించింది. వివిధ విభాగాల ఉద్యోగులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు సైతం అక్కడే ఉండే విధంగా చర్యలు చేపట్టింది. వివిధ విభాగాల ఉద్యోగులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు సైతం



పగిద్యాల మండల కేంద్రంలో సచివాలయం-2

అక్కడే ఉండే విధంగా చర్యలు చేపట్టారు. వీరితో పాటు వలంటీర్లను నియమించి ఏ ఒక్క లబ్ధిదారుడు సచివాలయానికి కూడా రావాల్సిన అవసరం లేకుండా కావాల్సిన పత్రాలు ఇంటి వద్దకే తీసుకువచ్చి అందజేస్తున్నారు.

నియోజవర్గంలో 71 సచివాలయాలు

నందికొట్కూరు నియోజవర్గంలో ఆరు మండలాలకు గాను 71 గ్రామ సచివాలయాలు, మున్సిపాలిటీ పరిధిలో వార్డు సచివాలయాలు-14 ఉన్నాయి. గ్రామ సచివాలయాల పరిధిలో ఉద్యోగుల సంఖ్య-607, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఖ్య-119 మంది ఉన్నారు. నియోజకవర్గంలో 1372 మంది వలంటీర్లు ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

> **అన్ని రకాల సేవలు సచివాలయాల్లోనే**
>
> అన్ని గ్రామ సచివాలయాల్లోనే ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి సర్టిఫికెట్ కావాలన్నా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి నిత్యం సచివాలయాలను తనిఖీ చేస్తూ సిబ్బందికి సూచనలు అందిస్తున్నాం. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చూస్తున్నాం.
>
> – పుల్లయ్య తహసీల్దార్, జూపాడుబంగ్లా మండలం

మీసేవల వద్ద పడిగాపులుగాదకుండా..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ఎనలేని ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. ఉన్న ఊర్లోనే అన్ని సేవలు అందించడంతో మండల కేంద్రాలకు వెళ్లే బాధలు తప్పాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 512కు పైగా సేవలు అందిస్తున్న గ్రామ సచివాలయంలో తాజాగా డ్రైవింగ్ లైసెన్స్, తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు ప్రముఖ ఆలయాల్లో దర్శనాలకు ఆన్‌లైన్ సేవలు, ఆస్తుల క్రయవిక్రయాలు రిజిస్ట్రేషన్లను అందిస్తున్నారు. సచివాలయల్లో కొన్ని సేవలను ఉచితం, మరి కొన్నింటికీ నిర్దిష్ట రుసుం రూ. 15లు చెల్లింపుతో అందిస్తున్నారు. ఆధార్, ఈకేవైసీ, కుల ధ్రువీకరణ పత్రం, 1బీ అడంగల్, విద్యుత్ కనెక్షన్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఓటరు నమోదు, ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్, బస్ పాస్ వంటి వాటికి మీ సేవ కేంద్రాల వద్ద పడి గాపుల కాయకుండా సచివాలయాల్లోనే జారీ చేసే విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

> **గ్రామ స్వరాజ్యం సాకారం**
>
> 
>
> మహాత్మాగాంధీ గన్న కలలు గన్న స్వరాజ్యం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా పల్లెలోని లబ్ధిదారులకు అందుతున్నాయి. ప్రజల ఇళ్ల వద్దకే పాలన తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగనన్నకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటాం. వలంటీర్లు ఇంటింటికీ వచ్చి పథకాలు అందిస్తున్నారు.
>
> – ఎద్దుల భార్గవ్, జీ.వీరాపురం, కొత్తపల్లి మండలం

> **స్థలంతో పాటు పక్కాగృహం మంజూరు**
>
> 
>
> మా గ్రామంలో సచివాలయం ఏర్పాటు వల్ల జగనన్న ప్రభుత్వ పరంగా ఇంటి స్థలంతో పాటు పక్కాగృహం కూడా ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి వద్ద దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేశారు. గతంలో ఇవి పొందాలంటే అనేక అవస్థలు పడేవాళ్లం. సీఎం వైఎస్ జగనన్న పాలనలో అమ్మ ఒడి వస్తుంది. సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకుంటే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి.
>
> – వెంకటేష్ శాతనకోట గ్రామం,నందికొట్కూరు మండలం

13 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

పాములపాడు: ఈ నెల 13 నుంచి ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ బాలాజీనాయక్, హెచ్‌ఎం వెంకటసుబ్బమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న అండర్ 14 విభాగం, 14న అండర్ 17 విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్కూలు గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో 9 క్రీడాంశాలు కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్ క్రీడాంశాల్లో బాల బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించబడునన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల కింద ఉన్న పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చునని వివరించారు.

ఉత్సవాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

మహానంది: త్వరలో జరగనున్న వినాయకచవితి ఉత్సవాల్లో వేడుకల పేరుతో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. బొల్లవరం గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామస్తులతో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ విగ్రహాల వద్ద మైకులు, ఉత్సవం వెంట డీజేలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎలాంటి గొడవలు ఉండవని హామీ పత్రం రాసివ్వాల్సి ఉంటుందన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

నందికొట్కూరు: పట్టణంలోని కర్నూలు-గుంటూరు రోడ్డు మార్గంలో ఉన్న ఖబరస్థాన్ (ముస్లింల శ్మశానవాటిక)లో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ బోరుబావి ఏర్పాటు చేయించారని ముస్లిం మతపెద్దలు తెలిపారు. ఆదివారం బోరుబావి ఏర్పాటుపై మస్లిం మతపెద్దలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ.. 40 సంవత్సరాల క్రితమే పట్టణ ముస్లిం ప్రజల అవసరాల కోసం ఏర్పాటైన ఖబరస్థాన్ లో నేడు నియోజకవర్గ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సహకారంతో బోరుబావి ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఏర్పాటు చేసిన బోరుబాయిలో 320 అడుగులకు గాను 3 ఇంచులు



బోరుబావి వద్ద ముస్లిం మతపెద్దలు

నీరు పడ్డాయని తెలిపారు. శనివారం ఎమ్మెల్యే ఆర్థర్ ఆదేశాల మేరకు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో బోరు బావి తవ్వకాన్ని మత పెద్దల దువాతో ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో హఫీజ్‌లు మాలిక్, ఇమ్రాన్, సైపులా, వైస్ చైర్మన్ మొల్ల రబ్బానీ, కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుస్సేన్, నాయకులు వజీర్ బాషా, మాబాషా పాల్గొన్నారు.

న్యాయస్థానం దృష్టిలో అందరూ సమానమే

జూపాడుబంగ్లా: న్యాయస్థానం దృష్టిలో అందరూ సమానమేనని, తప్పుచేసిన వారెవరైనా శిక్షల నుంచి తప్పించుకోలేరని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కోసిక తిరుమలేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ పోచా జగదీశ్వర రెడ్డి అన్నారు. స్కిల్ డెవలప్‌మెంటు కేసులో చంద్రబాబునాయుడుకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో వైఎస్సార్సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. తప్పుచేసిన వారు ఎప్పటికైనా శిక్ష అనుభవించాల్సిందేనని తెలిపారు. తనది 40ఏళ్ల రాజకీయ చరిత్ర అని గొప్పలు చెప్పుకొనే చంద్రబాబునాయుడు ఎన్నో తప్పులు చేసి వాటిని కప్పిపుచ్చుకొని తిరుగుతున్నారని తెలిపారు. అతనిపై ఎవరైనా అవినీతి, అక్రమాలు చేశారని కోర్టును ఆశ్రయిస్తే స్టేలు తెచ్చుకొని రాజకీయ పబ్బం గడుపుకొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సువర్ణమ్మ, వైస్ ఎంపీపీలు రమణమ్మ, తోకల కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ వై.వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు దిలీప్‌రాజు, జంగాలపెద్దన్న, దేవసహాయం, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తప్పు చేసిన ఎవరైనా దోషులే

మహానంది: తప్పు చేసిన ఎవరైనా చట్టం దృష్టిలో దోషులేనని వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుమల కృష్ణ (జగన్‌కృష్ణ) అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని బొల్లవరంలో మాట్లాడుతూ.. స్కిల్ డ్‌వలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అరెస్టు కావడంతో న్యాయం గెలిచిందన్నారు. కోట్లాది రూపాయల కుంభకోణంపై మరింత లోతుగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకుందాం

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 18వ తేదీ నుంచి పట్టణంలో జరుపుకునే వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ మహేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆవరణలో శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని, మండపాల వద్ద భక్తి వాతావరణాన్ని కల్పించాలని చెప్పారు. మైకులను ఉదయం 6.30 నుంచి 10గంటల వరకు, రాత్రి 6 నుంచి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలన్నారు. గణేష్ నిమజ్జనం రోజున విగ్రహాలను త్వరగా నిమజ్జనానికి తరలించాలని సూచించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలను సేవించి ఊరేగింపులో పాల్గొనరాదన్నారు. ఏదైనా సమస్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ మహేశ్వరరెడ్డి

వచ్చినచో దగ్గరలోని పోలీసు స్టేషన్‌లో గాని, కేంద్ర సమితి వారికి తెలియజేయాలన్నారు. గణేష్ కేంద్ర సమితి మహోత్సవ నాయకులు గంగిశెట్టి శ్రీధర్, వెంటకదాసు, నాగేంద్ర, సుధాకర్, చలంబాబు, కేశవ మూర్తి, రవీంద్రనాథ్, శంకర్, మోహన్, నాగరాజు, కేశవమూర్తి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎస్పీజీ మైదానంలో అండర్ -16 నంద్యాల జిల్లా బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించినట్లు సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ తెలిపారు. ఫుట్‌బాల్ పోటీలను సంఘం అధ్యక్షుడు కేఈ వినయ్‌సాగర్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మొత్తం 120 మంది క్రీడాకారులు పాల్గొనగా.. నంద్యాల జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు సంబంధించి బాలికలు, బాలల జట్టును 16 మంది చొప్పున ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపిక జట్లు త్వరలో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దివాకర్, హరివరం జెడ్పీపాఠశాల హెచ్ఎం మోహన్‌రెడ్డి, అనిల్‌బాబు, జగదీష్, రాజు, రాజా చక్రవర్తి పాల్గొన్నారు

ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిద్దాం

నంద్యాల(వ్యవసాయం): ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా ఆరోగ్య భారతి పని చేస్తుందని ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో ఆరోగ్య కార్యకర్తల శిక్షణ శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ సహదేవుడు హాజరై ఆహారం, ఆరోగ్యం, గృహ వైద్యం, శస్త్ర చికిత్స విషయాలపై అవగాహన కల్పించారు. వైద్యులు యశోదర, గీత, రామశర్మ, మాధవచౌదరి, కుమారస్వామి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు వివరాలు నమోదు చేసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులంతా http://www.gdcnandyal. ac.in/alumregfrom.php ద్వారా కళాశాల వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించడానికి కళాశాల పూర్వ విద్యార్థి శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రణాళికను రూపొందించామని చెప్పారు. కావున విద్యార్థులు వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ 9440878658, 9866418418 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇంటింటికీ రక్షిత నీటి సరఫరాకు చర్యలు

పగిద్యాల: ఇంటింటికీ రక్షిత మంచినీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ మనోహర్, జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) మంజులవాణి తెలిపారు. ఆదివారం మండలంలోని పగిద్యాల, ఆంజనేయనగర్, బీరవోలు గ్రామాలను వారు సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఐదు రోజులుగా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, 12 ట్యాంకర్లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రతి రోజు కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డిని ఆదేశించారు. గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, జీఎల్ఎస్ఆర్ ట్యాంక్‌లు, మినీ సిస్టం ట్యాంక్‌లలో బ్యాక్టీరియా ఉండకుండా ఎండబెట్టాలన్నారు. ట్యాంక్‌లకు నీటి సరఫరా పునరుద్దరిస్తే ప్రతి ఫిల్లింగ్‌కు క్లోరినేషన్ తప్పనిసరి



ప్రజలతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ మనోహర్

చేయాలని సూచించారు. మంచినీటి పైప్‌లైన్‌లు కలిగిన ప్రదేశాల్లో చెత్తచెదారం వేయకుండా దండోరా వేయించాలన్నారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, కోట్ల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఐలమ్మ,రామకృష్ణ ఆశయాలను సాధిద్దాం

ఆత్మకూరు: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేసిన యోధురాలు చాకలి ఐలమ్మ, విద్యుత్ పోరాట యోధుడు సత్తెనపల్లి రామకృష్ణ ఆశయాలను సాధిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఆదివారం ఐలమ్మ, రామకృష్ణల వర్ధంతి సభను నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రణధీర్, రామకృష్ణ, శివుడు, వెంకటస్వామి, గోపాల్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాటాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రజక సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు బస్తిపాటి మౌలాలి అన్నారు. చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల రజక సంక్షేమ సంఘం నాయకులు రామాంజనేయులు, బండ్ల రవి కుమార్, చాకలి నాగభూషణం, తరిగోపుల నాగేశ్వరరావు, గోకారి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మజ్ఞానాన్ని కలిగి ఉండాలి

నంద్యాల(వ్యవసాయం): ప్రతి ఒక్కరూ ఆత్మజ్ఞానాన్ని కలిగి ఉండాలని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జ్ఞానప్రసాద్ గురూజీ పేర్కొన్నారు. పట్టణంలోని అమ్మవారిశాల గీతామందిరంలో ఆదివారం ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీతను దినచర్యలో భాగంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు భవనాశి వాసు, తిమ్మయ్య, రామకృష్ణ, అంజి, రాజాచారి, మహిళా సంఘం నాయకులు ఇందుమతి, శోభారాణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

చాగలమర్రి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, ఎంపీపీ వీరభద్రుడు తెలిపారు. ఆదివారం పట్టణంలోని రిక్వెస్ట్ స్టాప్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఎస్‌టీయూ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ అనురాధ, ఎంఈఓ-2 న్యామతుల్లా, హెచ్‌ఎం కోటయ్య, ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకులు శివశంకర్, నారాయణరెడ్డి, నాగేంద్ర కుమార్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం కావడంతో ఉదయమే అమ్మవారికి అభిషేకాలు, నిత్యపూజల అనంతరం హారతులిచ్చి పట్టు వస్త్రాలతో ముస్తాబు చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు చీర, సారె, పిండివంటలను నైవేద్యంగా సమర్పించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రో వాలీబాల్ విజేత వైట్ వాకర్స్ టీం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక గురురాజ ఇంట్రా స్కూల్‌లో జరిగిన ప్రో వాలీబాల్ పోటీల్లో వైట్ వాకర్స్ టీం విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన పోటీల్లో రైజింగ్ స్టార్స్, వాకర్స్ జట్లు తలపడగా వాకర్స్ జట్టు గెలుపొందింది. విజేత జట్టుకు గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరి రెడ్డి, నంద్యాల ఎంఈఓ బ్రహ్మం బహుమతులు అందజేశారు.అభిషేక్కు బెస్ట్ ప్లేయర్ అవార్డు ప్రదానం చేశారు.

వినాయక చవితికి గణనాథుల ముస్తాబు




విక్రయానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు



గణనాథుని విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కార్మికురాలు

నందికొట్కూరు రూరల్ : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వినాయక చవితి సందడి మొదలైంది. ఒరిస్సా, రాజస్థాన్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు పట్టణలో పలు ప్రాంతాల్లో గుడారాలు వేసుకొని రెండునెలల ముందే పట్టణంలో విగ్రహాల తయారీ చేపట్టారు. భక్తులతో తొలి పూజలు అందుకుని విఘ్నాలను తొలగించే అధినాయకుడు మహాగణపతి నవరాత్రుల ఉత్సవాలు మరో ఎనిమిది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు సమయం దగ్గర పడుతుండటంతో విగ్రహాల తయారీ దారులు వేగంగా తుది మెరుగులు దిద్దుతున్నారు. గతంలో గణపతి విగ్రహాల తయారీ పూర్తిగా మట్టితో చేసేవారు. ఉత్సవ నిర్వాహకులు నేడు భారీ విగ్రహాల కోసం పోటీ పడుతుండటంలో తయారీ దారులు సైతం మట్టితో తయారీకి స్వస్తి పలికి ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాల తయారీకే ప్రాధాన్యతనిస్తున్నారు. ఇవి పర్యాటకానికి చేటు కలిగించేవైనా తప్పడంలేదని తయారీదారులు చెబుతున్నారు. గతంలో ప్రధాన సెంటర్లలో గణపతి విగ్రహాలు ఏర్పాటు చేసేవారు. నేడు యువత ఉత్సవాలపై ఎక్కువ ఉత్సాహం చూపుతుంటంతో ప్రతి గ్రామంలో రెండు, మూడు విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో డిమాండ్ పెరిగి పని త్వరగా పూర్తయ్యే ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌కే ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో 2నుంచి 15అడుగుల వరకు విగ్రహాలు తయారు చేస్తున్నారు. వీటి ధర రూ. 2వేల నుంచి రూ.30వేల వరకు ఉన్నాయి. నందికొట్కూరు పట్టణం, చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ఉత్సవ నిర్వాహకులు వచ్చి ఆర్డర్లు ఇస్తున్నారని విగ్రహాల విక్రయదారులు చెబుతున్నారు.



ప్రత్యేక ఆకర్షణలో వెంకటేశ్వర గణపతి

వాతావరణ మార్పులను బట్టి జాగ్రత్తలు తీసుకోవాలి

- దేశీ శిక్షణ కార్యక్రమంలో బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ

కర్నూలు(అగ్రికల్చర్): వాతావరణ పరిస్థితులను బట్టి వివిధ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ పేర్కొన్నారు. ఆదివారం దేశీ డిప్లొమ కోర్సు కింద 5వ వారం ఇన్‌పుట్ డీలర్లకు కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ... వివిధ వాతావరణ పరిస్థితుల్లో రైతులు పాటించవలసిన పంటల సరళిని వివరించారు. ప్రకృతి వనరులైన నేల,నీరు, పైర్లు, గాలి తదితర వాటిని సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని సూచించారు. బెట్ట పరిస్థితులు ఉన్నప్పుడు, అధిక వర్షాలు పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విశ్రంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ..వర్షాలు పడినప్పుడు ప్రతి చుక్క భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరిగే విధంగా చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాలను పెంచుకునేందుకు వాటర్‌షెడ్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. దేశీ శిక్షణ కార్యక్రమంలో చెప్పే వివిధ అంశాలపై అవగాహన పెంచుకొని రైతులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ